## క్లుప్తంగా

### ప్రధాని, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు బీజేపీ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పీఎం కిసాన్ యోజన కింద ఎకరానికి రూ.10 వేలకు పెంచుతూ జీవో జారీ చేయడం, అల్లీపూర్‌ను మండల ఏర్పాటుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గొడ్డండ్ల రాజ్‌గోపాల్, రాజశేఖర్, మిట్టపల్లి రాజేందర్, అంగడి పరమేశ్వర్, బాలె శేఖర్, రచన్, రవి, హరీశ్, బాపు, శశిధర్, నందు, వెంకటి, పురుషోత్తం పాల్గొన్నారు.

### గ్రామపంచాయతీ వర్కర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ కార్మికులు

కథలాపూర్: తమ వేతనాలు పెంచాలని గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినందునా వేతనాలు రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నామని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతీ నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని నినదించారు. అనంతరం ఎంపీడీవో శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నర్సయ్య, దశరథం, మల్కయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్లాపూర్: మల్లాపూర్ మండలాన్ని విభజించి మరో కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల నాయకులు కోరారు. మండలంలోని పలు గ్రామాల(పాత బుగ్గారం నియోజకవర్గ గ్రామాలు) నాయకులు మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లాపూర్ మండలం భౌగోళికంగా జనాభాపరంగా చాలా పెద్దగా ఉందన్నారు. మా విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్త మండలం ఏర్పాటుకు సానుకూల నిర్ణయం వెలువడేలా కృషి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజోజి సదానందచారీ, బక్కూరి చింతామణి, తోర్తి పోచయ్య, పోతు శేఖర్, కొత్తపల్లి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్ సిటిజన్స్ సమాజ మార్గదర్శకులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: సీనియర్ సిటిజన్స్ సమాజ మార్గదర్శకులని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. శుక్రవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌ను, తల్లిదండ్రులను విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, హన్మంతరెడ్డి, యాకూబ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### జేసీబీ సీజ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ శివారులోని పెద్దవాగులో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ఓ జేసీబీని పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తీస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. పట్టుబడ్డ జేసీబీ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.



గోదావరిలో భక్తుల స్నానాలు

ధర్మపురి: ధర్మపురి పవిత్ర గోదావరిలో శుక్రవారం వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట స్నానాలు ఆచరించి అనంతరం ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు.



ఘనంగా తిరుప్పావై సేవ

కోరుట్ల టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం తిరుప్పావై సేవ, గోదాదేవి పాశురం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పంట పొలాల్లోకి ఎస్సారెస్పీ నీరు

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఎస్సారెస్పీ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో తూములోంచి నీరు వెళ్లడం లేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న పొలాల్లోకి ఎస్సారెస్పీ నీరు చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ అధికారులు స్పందించి కాలువలో చెత్తా చెదారం తొలగించాలని రైతులు కోరుతున్నారు.

## సావిత్రీ బాయిఫూలేకు నివాళి

జగిత్యాల/జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/కోరుట్ల/ధర్మపురి/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/రాయికల్/సారంగాపూర్/కథలాపూర్/మల్యాల/పెగడపల్లి/మల్లాపూర్/ మేడిపల్లి/ఇబ్రహీంపట్నం: సావిత్రీ పూలే జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ,ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, జిల్లాకేంద్రం,మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాలు, గ్రామాల్లో ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సావిత్రిబాయి పూలే విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా గ్రామీణ ప్రాంత మహిళలకు చదువునేర్పిన గొప్ప మహిళ అని కొనియాడారు. కార్యక్రమాల్లో అధికారులు, ఉపాధ్యాయులు, బీసీ, దళిత, యువజన సంఘాల నాయకులు, యువతీయువకులు, విద్యార్థులు నాయకులు పాల్గొన్నారు.



జగిత్యాల: నివాళి అర్పిస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది



రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



కోరుట్లలో టీచర్లను సన్మానిస్తున్న నాయకులు



జగిత్యాలటౌన్: నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నేతలు



మెట్‌పల్లిలో సావిత్రీ బాయి పూలేకు నివాళి అర్పిస్తున్న నాయకులు



ధర్మపురిలో మహిళా ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న నాయకులు

## కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

జగిత్యాలటౌన్: సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. ఈసందర్భంగా దీక్ష శిబిరం వద్ద రోడ్డు పక్కన నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తొలి మహిళా గురువు జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బర్ల నారాయణ, శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.



పూలేకు నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు

### భగవత్ ప్రసాదంలో పరమాత్ముని అనుగ్రహం

కోరుట్ల: నోములు, పూజలు, వ్రతాల సమయంలో ఇచ్చే భగవత్ ప్రసాదంలో పరమాత్ముని అనుగ్రహం నిక్షిప్తమై ఉంటుందని బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అష్టాదశ పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా పురాణ సప్తాహ ప్రవచనం చేశారు. సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్ష, కార్యదర్శులు మంచాల జగన్, బట్టు హరికృష్ణ, చైర్మన్ పడిగెల శ్రీనివాస్, కన్వీనర్ మోటూరి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళా శక్తి యూనిట్ల పరిశీలన

జగిత్యాలరూరల్: మహిళలు వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస, పొరండ్ల, లక్ష్మీపూర్ గ్రామాల్లో మహిళా శక్తి యూనిట్లను పరిశీలించి మాట్లాడారు. మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మహిళలు వ్యాపార రంగాల్లో రాణిస్తేనే ఆ కుటుంబాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏపీడీ చరణ్‌దాస్, ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, మరియ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూముల ఆక్రమణలపై విచారణ

- ఆత్మకూర్ శివారులో భూములు పరిశీలించిన అధికారులు
- అటవీ భూముల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు తొలగింపు



భూములు పరిశీలిస్తున్న అటవీ,విద్యుత్ అధికారులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ శివారులో అటవీ భూములు ఆక్రమణకు గురైన విషయంపై ఆ శాఖ అధికారులు విచారణ జరిపారు. తమ గ్రామ శివారులో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆత్మకూర్ గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో భూముల ఆక్రమణపై విచారణ జరపాలని కలెక్టర్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆక్రమణలకు గురైన భూములను శుక్రవారం అధికారులు పరిశీలించారు. భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను తీసివేయించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమైన అటవీ,పోలీస్ అధికారులు భూముల ఆక్రమణల విషయంపై చర్చించారు. గతంలో భూములు ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేశామని స్పష్టం చేశారు. అయినప్పటికీ మళ్లీ భూములు చదును చేస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. మరోవైపు అటవీ అధికారుల తీరుపై ఆత్మనగర్,ఆత్మకూర్ గ్రామస్తులు మండిపడ్డారు.వందల ఎకరాల భూములు ఆక్రమణలకు గురవుతున్న ఎందుకు పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. అటవీ భూముల్లో కొంతమంది సాగు చేస్తున్నారని, వాటిని రక్షించాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, వైర్‌ను అటవీ శాఖ అధికారులు సీజ్ చేశారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి, రాయికల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు షౌకత్‌అలీ, భూమేశ్, డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ అరుణ్, ఎఫ్ఎస్‌వో చైతన్యశ్రీ, విద్యుత్ ఏడీ మనోహర్, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి శిక్షణతో ఆర్థిక పురోగతి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: మహిళలు, గృహిణిలు, యువతులకు స్వయం ఉపాధి శిక్షణతో ఆర్థిక పురోగతి సాధిస్తారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జమాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ముస్లిం, మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు అందించడం జరుగుతుందని, శిక్షణ ఇవ్వడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మైనార్టీ మహిళలకు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ఇమాద్ ఉద్దీన్, షోయబ్ ఉల్ హక్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన గెజిటెడ్ ఉద్యోగులు**

జగిత్యాలరూరల్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, ఆఫీస్ కార్యదర్శి గొడిశెల అశోక్‌రాజ్, రూరల్ ఎంపీడీవో రమాదేవితో పాటు, పలువురు గెజిటెడ్ ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనాలి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంఈవో

జగిత్యాల: విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనాలని ఎంఈవో భీమయ్య అన్నారు. శుక్రవారం ఓల్డ్ హైస్కూల్‌లో ఎల్టా ఆధ్వర్యంలో ఒలంపియాడ్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎల్టా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

**జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక**

మల్యాల: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం వక్తృత్వ పోటీలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించగా, పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులు సీహెచ్.సాత్విక, పి.లహరి, డి.హర్షిక, కె.వైష్ణవి, బి.రఘు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఒలంపియాడ్ పోటీలో విద్యార్థుల ప్రతిభ**

కథలాపూర్: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మండలస్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్ పోటీలు నిర్వహించారు. స్ట్రీమ్‌-1 లో పోతారం పాఠశాలకు చెందిన విద్యార్థి శైలజ ప్రథమ, గంభీర్‌పూర్ పాఠశాలకు చెందిన మహేశ్ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. స్ట్రీమ్‌-2 లో కథలాపూర్ మోడల్‌స్కూల్‌కు చెందిన వరలక్ష్మి ప్రథమ, సహస్ర ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. వీరు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, ఎల్టా జిల్లా ప్రధానకార్యదర్శి పాటిల్ దరందీప్, మండల కన్వీనర్ సంజీవ్‌రెడ్డి, ఏడుకొండలు, దేవయ్య పాల్గొన్నారు.

### ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల తనిఖీ

మెట్‌పల్లి: పట్టణంలోని కేశవ ఆసుపత్రిని శుక్రవారం జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతికి మించి బెడ్లు వినియోగించడం, బయో వేస్టేజ్‌కు సంబంధించిన సర్టిఫికెట్‌ను రెన్యూవల్ చేయించుకోకపోవడం వంటి వాటిని గుర్తించి నిర్వాహకులకు మెమో ఇచ్చారు. అలాగే హిమగిరి, వినాయక స్కానింగ్ సెంటర్లతో పాటు హాద్య ఆసుపత్రిలో జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. వాటిలో రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రధానంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాయికల్ ప్రెస్‌క్లబ్ జేఏసీ, అర్చన ఐకేర్ వైద్యుల సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్రవైద్య నిపుణులు సుమన్, పర్వేజ్ 500 మంది విద్యార్థులకు నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ నిఖిల్, జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, జగదీశ్వర్, పాత్రికేయులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరుడికి క్షీరాభిషేకం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంద ఆలయం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు.స్వామివారిని రంగు రంగుల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

### ఖోఖో అఫిషియల్ సభ్యుడిగా రవీందర్

జగిత్యాల: ఖోఖో వరల్డ్ కప్ ఇంటర్నేషనల్ టెక్నికల్ అఫీషియల్ సభ్యుడిగా యూటీఎఫ్ జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ అనంతుల రవీందర్ ఎంపికయ్యారు. ఈనెల 13 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో నిర్వహించే పోటీల్లో అంపైర్‌గా, స్కోరర్‌గా వ్యవహరించనున్నారు. ఆయన ఎంపిక పట్ల యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ అభినందనలు తెలిపారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

మేడిపల్లి: ఎస్బీఐ క్యాలెండర్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడిపల్లి ఏరియా ఇన్‌చార్జి గుగ్గిళ్ల రమేశ్, కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మాజీ ఎంపీపీ మకిలీ ఇజ్రాయిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మడి రవి, తదితరులు పాల్గొన్నారు.

### యూరియా కోసం రైతుల ఇక్కట్లు



టోకెన్ల కోసం ఎగబడుతున్న రైతులు

కథలాపూర్: మండలంలోని రైతులు యూరియా బస్తాల కోసం ఇక్కట్లపాలవుతున్నారు. వరి, మొక్కజొన్న పంటల సాగుకు యూరియా అవసరమని, 20 రోజులుగా యూరియా కోసం నిరీక్షిస్తున్నామని రైతులు తెలిపారు. మండలంలోని భూషణరావుపేట, చింతకుంట గ్రామాలకు శుక్రవారం సాయంత్రం యూరియా బస్తాలతో లారీలు రాగా, వాటికోసం రైతులు ఎగబడ్డారు. పలువురి రైతులకు బస్తాలు అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి పంటలకు సరిపడేలా యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

## 317 బాధితులందరికీ న్యాయం చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: స్పౌజ్, మెడికల్, మ్యూచువల్ మాత్రమే కాకుండా 317 జీవో తో స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూఎస్ టీఎస్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం ఇందిరాభవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత పది జిల్లాలను జోన్లుగా మారుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరావు, అమర్నాథరెడ్డి, రవికుమార్, గోవర్ధన్, రాజగోపాల్ పాల్గొన్నారు.

**● ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని వినతి**

రాయికల్: త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని దావన్‌పెల్లి గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు చెలిమెల మల్లేశం శుక్రవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామానికి ఒక్కసారి కూడా ఎస్సీ రిజర్వేషన్ రాలేదని గుర్తు చేశారు.

**● ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి**

ఇబ్రహీంపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి మధు తెలిపారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జంగిలి అశోక్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**● వాహనాలు పట్టివేత**

మెట్‌పల్లి: అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా.. అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు, ఒక ఇసుక టిప్పర్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించామని సీఐ పేర్కొన్నారు.

**● ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి**

మల్లాపూర్: మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ శరణ్య అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్‌లో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆమె పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్య, ఆశ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**● డీఎస్పీ విచారణ**

రాయికల్: మండలంలోని మైతాపూర్, అయోధ్య, కిష్టంపేట గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణలో భాగంగా శుక్రవారం ఆయా గ్రామాల్లో డీఎస్పీ రఘుచందర్ విచారణ చేపట్టారు. ఆయన వెంట సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సుధీర్‌రావు ఉన్నారు.

**● విద్యార్థులకు తాగునీరందించాలని వినతి**

మల్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు తాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దొంతరవేణి శేఖర్ శుక్రవారం ఈవో శ్రీకాంత్‌కు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం పాఠశాలను సందర్శించి, సమస్యలు తెలుసుకొని, గ్రామ పంచాయతీ వాటర్ ప్లాంట్ ద్వారా పాఠశాల విద్యార్థులకు తాగునీరందించాలని అన్నారు. కార్యక్రమంలో గుడిసె అలంకార్, మహేశ్, హరీశ్, గుడిసె మహేశ్ పాల్గొన్నారు.

**● గణతంత్ర దినోత్సవాల్లో అంబేడ్కర్ ఫొటో పెట్టాలి**

కథలాపూర్: గణతంత్ర దినోత్సవాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫొటో పెట్టాలని అంబేడ్కర్ మాదిగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కథలాపూర్‌లో ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కలిగోట రాజయ్య, నాయకులు గణేశ్, తుర్తి దేవేందర్, బాలె ఇస్తార్, తరి రమేశ్ పాల్గొన్నారు.

**● అయోడిన్ లోపంతో అనర్థాలు**

జగిత్యాల: అయోడిన్ లోపంతో అనర్థాలు వస్తాయని, విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో భీమయ్య అన్నారు. శుక్రవారం ఓల్డ్ హైస్కూల్‌లో ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఆశీర్వాద్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, వంశీకృష్ణ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.